క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సొలస బస్టాండు సమీపంలోని సాయినాథ ఆలయంలో మాఘమాస బహుళ చవితిని పురస్కరించుకొని స్వామివారికి విశేష పూజలు చేశారు. ఉదయాన్నే అర్చకులు విశ్వనాథశాస్త్రి స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి హారతులు సమర్పించారు. అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు బీసీల ర్యాలీ

మంగళగిరి: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో మండల్ టూ ఉద్యమం పేరిట భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని బీజీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పాత మంగళగిరిలోని సీతారామ కోవెల వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని, అక్కడి నుంచి మిద్దె సెంటర్, మెయిన్ బజారు, గాలిగోపురం, గౌతమ బుద్ధా రోడ్డు, అంబేద్కర్ విగ్రహం మీదుగా ఈద్గా సమావేశ మందిరం వద్దకు చేరుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల తదితరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. బీసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

మల్లేశ్వరస్వామికి లాకర్ బీరువా బహూకరణ

మంగళగిరి: నగరంలో వేంచేసిఉన్న గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయానికి దేవస్థాన మాజీ ఈఓ జేవీ నారాయణ గురువారం రూ.85 వేల విలువైన లాకర్ బీరువా (బోషాణం)ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ లక్ష్మీరాధిక, ధర్మకర్తల మండలి సభ్యులు దాత నారాయణకు అభినందనలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల మండలం తాడిబోయినవారిపాలేనికి చెందిన ఓ కుటుంబానికి మంగళగిరి శాసన సభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి గురువారం ఆర్థిక సహాయం అందించారు. తాడిబోయినవారిపాలేనికి చెందిన తాడిబోయిన గోపి (బ్రహ్మడు) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్కే రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. గురువారం ఆ ఆర్థిక సహాయాన్ని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ తాడిబోయిన గోపాలరావు, నెరదల వెంకటేశ్వరరావు, కాజ బ్రహ్మయ్య, తాడిబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర అభివృద్ధి లక్ష్యాలపై సర్వే



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి లక్ష్యాలపై సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డి.అనూరాధ గురువారం తెలిపారు. ఎస్డీజీ (సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ సర్వే)లో భాగంగా సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, మహిళా పోలీసు, ఆశా కార్యకర్తలు సంబంధిత అంగన్‌వాడీ కేంద్రాల్లోని 0–5 ఏళ్లలోపు చిన్నారులకు సంబంధించిన ఆధార్ నంబర్, ఆర్సీహెచ్ నంబర్, తల్లిదండ్రుల పేర్లను నమోదు చేసి వారితో బయోమెట్రిక్ నమోదు చేస్తారన్నారు. గర్భిణుల ఆధార్, ఆర్సీహెచ్ నంబర్‌తో పాటుగా వారు పొందుతున్న సేవలు, వ్యాక్సిన్, పరీక్షల వివరాలతో పాటు భర్త ఆధార్ నమోదు చేస్తున్నట్లు వివరించారు.

హోంగార్డుల చేయూత అభినందనీయం

నగరంపాలెం: ఉద్యోగ విరమణ చేసిన మహిళా హోంగార్డుకు సహచర హోంగార్డులు ఆర్థికంగా చేయూతనివ్వడం అభినందనీయమని ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. గతేడాది సెప్టెంబర్ 9న ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు జి.కనకదుర్గకు హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.2.32 లక్షల చెక్కుని గురువారం పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందించారు. ఆర్ఐ రమేష్‌కృష్ణన్, ఎన్‌సీఓ శ్రీనివాస్, సుధీర్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు



మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి

మంగళగిరి కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరులో మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖద్వారం నుంచి ఆత్మకూరు పంచాయతీ కార్యాలయం వరకు ఉన్న డివైడర్‌ల మధ్య స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ పనులను మంగళగిరి కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా మార్జిన్ వదిలేసి మొక్కలను నాటే కార్యక్రమాన్ని కూడా చేపట్టామని, ఆత్మకూరుతో పాటు మంగళగిరి కార్పొషన్ పరిధిలో ఉన్న జగనన్న కాలనీలో ప్రతి ఒక్కచోట మొక్కలు నాటేందుకు స్వచ్ఛాంధ్ర సంస్థ 13 లక్షల రూపాయల నిధులు కేటాయించిందని తెలిపారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో మొక్కలను సంరక్షించి కాలుష్యాన్ని నివారించడంతో పాటు, రహదారులు, జగనన్న కాలనీలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

కాజలో కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం

మంగళగిరి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ నగర పరిధిలో కాజలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట గురువారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ మాట్లాడుతూ కేంద్రం బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం చేసిందన్నారు. రాజధానికి నిధులు కేటాయించలేదని, ప్రత్యేక హోదా గురించి మాట్లాడలేదని విమర్శించారు. ఇది రైతు వ్యతిరేక బడ్జెట్ అని పేర్కొన్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి, ఎరువులకు, ఆహార భద్రతకు నిధులు తగ్గించడం బాధాకరమన్నారు. ఇది అమృత బడ్జెట్ కాదని అదానీ, అంబానీల కోసం రూపొందించిన కార్పొరేట్ బడ్జెట్ అని విమర్శించారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి భీమిరెడ్డి కోటేశ్వరి, రైతు సంఘం మండల కార్యదర్శి టి.ప్రసాద్‌రెడ్డి, వల్లూరి భారతి, కౌలు రైతు సంఘం నాయకులు అప్పికట్ల ప్రకాశరావు, సీఐటీయూ మండల కార్యదర్శి వి.పూర్ణయ్య, ఈదా ప్రతాపరెడ్డి, మాధవరెడ్డి, గోపాల్‌రెడ్డి, సత్యమారెడ్డి, అప్పారావు, సుమ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డతో సహా మహిళ ఆత్మహత్యాయత్నం

కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు



ఆత్మహత్యాయత్నం చేసిన మహిళకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

తాడేపల్లిరూరల్: ఓ వివాహిత తన కుమారుడితో సహా ప్రకాశం బ్యారేజ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు గురువారం ప్రయత్నిస్తుండగా ఆటో డ్రైవర్ అడ్డుకుని తాడేపల్లి ఔట్‌పోస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఔట్‌పోస్ట్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు సంఘటనా స్థలానికి వెళ్లి ఆమెను తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన చందోలు చిరంజీవి (లేటు), చందోలు సువర్ణకు 10 సంవత్సరాల క్రితం వివాహమైంది. అనారోగ్యంతో భర్త చనిపోవడం, అనంతరం కుమార్తె కూడా అనారోగ్యం బారినపడి రూ.13 లక్షలు ఖర్చు చేసినా చివరకు మృతి చెందింది. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువగా ఉండటం, అత్తమామలు, తల్లిదండ్రులు లేకపోవడం, బంధువులు పట్టించుకోకపోవడంతో తన మూడేళ్ల కుమారుడితో వచ్చి ప్రకాశం బ్యారేజ్ 33వ కానా వద్ద ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నిస్తుండగా ఆటో డ్రైవర్ ఆమె ప్రయత్నాన్ని అడ్డుకున్నాడు. ఆమెకు కౌన్సెలింగ్ నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరరావు తెలిపారు.

తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగాలి

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు



కేఎల్‌యూ విద్యార్థులలో ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

తాడేపల్లిరూరల్: తల్లిదండ్రులు గర్వపడేలా మన ఎదుగుదల సాగాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. గురువారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూ ఎంబీఏ విద్యార్థులు కాఫీ విత్ సీఈవో కార్యక్రమంలో భాగంగా విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో ద్వారకా తిరుమలరావును కలిశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో మెలకువలు తెలుసుకోవడం కోసం విద్యార్థులు వన్ మినిట్ మేనేజర్ అనే పుస్తకాన్ని చదవాలని సూచించారు. యువత ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు వెళితే అనుకున్నది సాధించవచ్చన్నారు. నాయకత్వ లక్షణాలతో విజయం సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, అధ్యాపకులు డాక్టర్ జేవీ రమణ, డాక్టర్ సీహెచ్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పెయింటర్ దుర్మరణం

మరొకరికి తీవ్రగాయాలు



దస్తగిరి మృతదేహం

తాడేపల్లిరూరల్: 16వ నంబర్ జాతీయ రహదారిపై తాడేపల్లి పట్టణ పరిధిలోని ట్రక్ లేబై వద్ద బైక్ మీద వెళుతున్న ఇద్దరు వ్యక్తులను వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. తాడేపల్లి ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పెయింటింగ్ పనిచేసుకునే ఎస్‌కే దస్తగిరి (32), ఎస్‌కే సుభాని ద్విచక్ర వాహనంపై పెయింటింగ్ పనుల నిమిత్తం మాట్లాడేందుకు సాయంత్రం సమయంలో విజయవాడ వెళుతున్నారు. తాడేపల్లి జాతీయ రహదారిపై ట్రక్ లేబై దగ్గరకు రాగానే గుంటూరు వైపు నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న సుభాని రోడ్డుకు ఎడమ వైపు పడగా, వెనుక కూర్చున్న దస్తగిరి కుడివైపు పడ్డాడు. వెనుక వస్తున్న లారీ దస్తగిరి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డుపై పడిన ఎస్‌కే సుభానికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై దస్తగిరి భార్య ఎస్‌కే మహిమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దస్తగిరితో మహిమకు మూడేళ్ల క్రితం వివాహం కాగా, ఏడాదిన్నర బాబు ఉన్నట్లు బంధువులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మస్తాన్‌షా ఉరుసు మహోత్సవాలు

పాత గుంటూరు: గుంటూరు జీటీ రోడ్డులోని హజరత్ కాలేమస్తాన్‌షా అవులియా ఉరుసు మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దర్గా ధర్మకర్త రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన గంధం మహోత్సవం నగర ప్రధాన వీధుల్లో కొనసాగుతూ గురువారం ఉదయం 10 గంటల వరకు ఘనంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. బాబా దర్శనానికి వస్తున్న భక్తుల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మధ్యాహ్నం, సాయంత్రం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 4 గంటలకు గంధ పంపిణీ, దీపారాధన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగర ప్రముఖులు, భక్తులు విశేష సంఖ్యలో బాబా సమాధిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు



గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ డీ–1 సెక్షన్ పరిధిలోని బ్రాడీపేట, అరండల్‌పేట ప్రాంతాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం పర్యవేక్షణ ఇంజినీర్ ఎం.అల్సస్, నగర ఈఈ శ్రీనివాసబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.విజయకృష్ణ నేతృత్వంలో సిబ్బంది విస్తృత తనిఖీలు నిర్వహించారు. 59 మంది అధికారులు, 177 మంది సిబ్బంది, 59 బృందాలుగా ఏర్పడి, 4,692 సర్వీసుల్ని తనిఖీ చేశారు. అనుమతి లేకుండా నేరుగా చౌర్యానికి పాల్పడుతున్న 139 మందికి రూ.9.65 లక్షల అపరాధ రుసుం విధించారు. అనుమతించిన కేటగిరి కాకుండా, ఇతర కేటగిరీల్లో విద్యుత్ వినియోగిస్తున్న ఐదుగురిపై రూ. 1.10 లక్షలు, అనుమతి లోడుకంటే అదనంగా విద్యుత్ వినియోగిస్తున్న 134 మందికి రూ. 8.55 లక్షలు అపరాధ రుసుం విధించారు. దాడుల్లో విద్యుత్ అధికారులు ఎం.రవికుమార్, కె.రవికుమార్, ఎం.ముస్తాక్ అహ్మద్, కె.కోటేశ్వరరావు, కె.అంజినీరావు పాల్గొన్నారు.

బోరు పంపులకు మరమ్మతులు



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కొలనుకొండలో గురువారం కార్పొరేషన్ ఇంజినీరింగ్ సిబ్బంది మరమ్మతులకు గురైన బోరు పంపులను బాగుచేశారు. రాబోయే ఎండాకాలంలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు కార్పొరేషన్ వ్యాప్తంగా ఉన్న అన్ని బోరు పంపులకు మరమ్మతులు చేపట్టామని కార్పొరేషన్ పంపుల విభాగం ఇంజినీరింగ్ సిబ్బంది తెలిపారు. దానిలో భాగంగా కొలనుకొండలో సచివాలయ సిబ్బంది విజ్ఞప్తి మేరకు ఈ బోరుపంపుకు మరమ్మతులు చేసినట్లు పేర్కొన్నారు.

రెండు లారీలు సీజ్



తాడికొండ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసిన తాడికొండ పోలీసులకు అప్పగించినట్లు మంగళగిరి ఎస్ఈబీ అధికారులు గురువారం తెలిపారు. సెబ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికొండ మండలం అడ్డరోడ్డు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో నకిలీ వే బిల్లులతో వెళుతున్న ఓ లారీతో పాటు, ఎక్కువ మొత్తంలో ఇసుకను తరలిస్తున్న మరో లారీని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఈబీ సీఐ మారయ్య తెలిపారు. ఎస్ఈబీ ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

ఉండవల్లి సుబ్బారావు చిరస్మరణీయులు

ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి



తాడికొండ: తన తండ్రి ఉండవల్లి సుబ్బారావు చిరస్మరణీయులని, ఉన్నత విలువలతో జీవించిన గొప్ప వ్యక్తని తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. ఎమ్మెల్యే శ్రీదేవి తండ్రి ఉండవల్లి సుబ్బారావు ప్రథమ వర్ధంతిని తాడికొండలోని స్వగృహంలో బుధవారం నిర్వహించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఉండవల్లి సుబ్బారావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ తన తండ్రి నియోజకవర్గ ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచే ఉంటారన్నారు. కార్యక్రమంలో తాడికొండ నియోజకవర్గ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

తెనాలిరూరల్: భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని నాజరు పేటకు చెందిన నక్కా రవి కుమార్(33) కూలి పనులకు వెళ్తుంటాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇటీవల అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. కాపురానికి రమ్మంటే ఆమె రాకపోవడంతో మనస్థాపానికి గురై ఈ నెల 5న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గుంటూరు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం



గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికంగా దృఢంగా ఉండగలరని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా తెలిపారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం ఏఎన్‌యూ అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్ పోటీల్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని సూచించారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహద పడతాయని, విద్యార్థినులు క్రీడల్లో తప్పనిసరిగా ప్రావీణ్యం సంపాదించాలని ఆయన సూచించారు. పవర్ లిఫ్టింగ్ క్రీడలో పురుషులతో పాటు మహిళలు సైతం పాల్గొని సాధన చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, క్రీడా శిక్షకులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో ఎరువుల నియంత్రణ అవసరం

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని మొక్కజొన్న పొలాలను గురువారం జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, మండల ఏఓ జి.ప్రేమ్‌సాగర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో జిల్లా అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడారు. మొక్కజొన్న, జొన్న పంటలకు ఎరువులు తగు మోతాదులో వేయాలన్నారు. మొక్కజొన్నకు ఎకరానికి 48కిలోల నత్రజని, 24కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ వేయాలని సూచించారు. జొన్న పైరులో 40కిలోల నత్రజని, 24కిలోల భాస్వరం, 16కిలోల పొటాష్ సరిపోతుందన్నారు. ఆర్బీకేలో పంట నమోదు చేసుకోవాలని సూచించారు. వీఏఏలు నాగేంద్ర, వంశీ, నాగరాజు, ఏఈఓ మోహన్, రైతులు ఉన్నారు. అలాగే.. నందివెలుగు పంచాయతీ కార్యాలయంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023 సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ డాక్టర్ ప్రవీణ చిరుధాన్యాల ప్రాముఖ్యత వివరించారు.

అట్టహాసంగా యూనిక్వెస్ట్–2కే23 వేడుకలు



వేడుకలను ప్రారంభిస్తున్న విట్ వైస్ చాన్సలర్ డాక్టర్ కోటారెడ్డి, చిన్నా బత్తినభాగ్యయ్య

మేడికొండూరు: డోకిపర్రు యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జాతీయ సాంకేతిక సాంస్కృతిక క్రీడా ఉత్సవం 2కే–23ను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఏపీ విట్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి హాజరయ్యారు. కళాశాల చైర్మన్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య అధ్యక్షతన ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. విట్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా ముందుకు సాగిపోవాలని చెప్పారు. బిడ్డలపై తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు చేరేలా కష్టపడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టెక్నికల్ ప్రజంటేషన్, టెక్నికల్ క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, కోడింగ్ హేక్‌దాన్, పోస్టర్ ప్రజంటేషన్, తీమ్ పెయింటింగ్, షార్ట్ ఫిలిం, క్రియేటివ్ ఫొటోగ్రఫీ, సింగింగ్ కాంపిటీషన్, ఫ్యాషన్ ప్యారడే, స్పోర్ట్స్ ఈవెంట్స్ పోటీలు నిర్వహించారు. ప్రతి ఈవెంట్‌లో విన్నర్స్, రన్నర్స్‌కు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఫాదర్ ఫాతిమా మర్రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేశవరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం నిరసన

తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ గురువారం కౌలు రైతు వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు దుగ్గిరాలలోని స్టేట్‌బ్యాంక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ గ్రామీణ పేద ప్రజలను కష్టకాలంలో ఆదుకునే ఉపాధి హామీ పథకంపై బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కోత విధించిందన్నారు. ఆహార సబ్సిడీ ధాన్యం కొనుగోళ్లు, వ్యవసాయ రంగానికి కేటాయింపుల విషయంలో కూడా కోతలు విధించడం అన్యాయమని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి బీజేపీ ప్రభుత్వం పేదలపై అనేక భారాలు వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వి.సాంబశివరావు, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.నాగమల్లేశ్వరరావు, అధ్యక్షుడు అమ్మిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కె.కోటయ్య, రమేష్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలి



మండీలో గొర్రెలను అందజేస్తున్న వెలుగు, వెటర్నరీ శాఖల అధికారులు

మేడికొండూరు: మండలంలోని అన్ని గ్రామాల్లోని డ్వాక్రా గ్రూపు మహిళలు ప్రభుత్వం అందిస్తున్న గొర్రెల యూనిట్లను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని మేడికొండూరు ఏపీఎం విజయభారతి అన్నారు. బుధవారం నరసరావుపేటలోని మండీలో పలువురు లబ్ధిదారులకు గొర్రెలను అందజేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ మండల ఏపీఎం విజయభారతి, మండల పశువైద్యాధికారి డాక్టర్ మౌనిక ప్రత్యేకంగా గొర్రెలకు ఇన్సూరెన్స్ ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అందజేశారు. ఒక్కో యూనిట్ విలువ రూ.75 వేల చొప్పున ప్రతి ఒక్క లబ్ధిదారుకు ప్రభుత్వం తరుపున మంజూరు చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు వడ్డీలేని రుణాలు కాగా, మిగతా వారికి వడ్డీతో కూడిన రుణాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి గ్రూపులోని సభ్యులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు షేక్ కరిముల్లా, మల్లేశ్వరరావు, కరుణ, యానిమేటర్లు ఉడతా భాగ్యలక్ష్మి, సుధా, శ్రీదేవి, పర్విన్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అమరావతిపై కేంద్రం స్పష్టత ఇవ్వలేదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

మంగళగిరి: ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి రాజధాని అని కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసిందని, అయితే దానిలో స్పష్టత లేదన్నారు. ప్రధాని మోదీ రాజధాని అమరావతిపై వంద నాలుకల ధోరణిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. అమరావతి రాజధాని విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కుమ్మక్కై వ్యవహరిస్తూ ఏపీకి రాజధాని లేని రాష్ట్రంగా చూపిస్తున్నారన్నారు. రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం 2,500 కోట్ల నిధులు మంజూరు చేసి విడుదల చేశామని చెప్పడంలో వాస్తవం లేదన్నారు. రాజధానికి కేవలం రూ.1500 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ప్రత్యేక హోదా విషయంపై కేంద్ర ప్రభుత్వం మాట్లాడటం లేదని, విభజన చట్టంలోని అంశాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఎం.రవి, ఎస్ఎస్ చెంగయ్య, జేవీ రాఘవులు, పి.బాలకృష్ణ, వై.కమలాకర్, ఎం.భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

'భజన కీర్తన'ల సీతామహాలక్ష్మికి సన్మానం

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం రాము చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం కదలడు వదలడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం భజనకీర్తనల కళాకారిణి కొక్కిలగడ్డ సీతామహాలక్ష్మిని సన్మానించారు.



